# ఆర్యాణి

రచన:
నాయుడు వెంకటసీతారామమూర్తి

రాత్రి పది గంటలు కావస్తోంది. సినిమా వీధి ప్రక్కసందుమీదుగా నడచి వెళ్ళి పోతున్నాను. మున్సిపాలిటీవారి విద్యుద్దీపాలు మాడిపోయిన వెధవ ముఖాల్లాగ వెలుగుతున్నాయి. తరుముకువస్తున్న నక్షత్రాలకు చిక్కకుండా చంద్రుడు మబ్బుల్లో దాక్కుంటున్నాడు. వీధంతా నిర్మానుష్యంగా వుంది. క్రీగంటిచూపుతో దిక్కులుచూస్తూ నా నడక లోని స్పీడును హెచ్చించాను. గోడకుప్రక్కగా నిలబడ్డనీడ నా దృష్టికి గోచరించింది. నెమ్మదిగా గాజులు చప్పుడుచేసుకుంటూ నన్ను దగ్గరగా రమ్మని ఆహ్వానిస్తున్నది. సడన్‌గా ఆగి దగ్గరకు వెళ్లేను.

"ఏవూరు?" నవ్వుతూ అడిగింది.

"ఈ ఊరే" అబద్ధం ఆడేను.

"వస్తారా?" నన్ను ఎగాదిగా చూసి ప్రశ్నించింది.

అమ్మాయి కాకపోయినా ముదుసలిమాత్రం కాదు. గుండ్రనిముఖం, రేగినజుట్టు పూర్తిగా జారిన పమిట, నన్నటి తెల్లకోక కట్టుకుంది. పాతికా ముప్పైమధ్య వుంటుంది వయస్సు. లైటు వెలుతుర్లో ఆమెసౌందర్యాన్ని శాంతంగా పరిశీలించేను. అనాకారి కాదు, అందమైన విగ్రహమే.

"రాత్రికి వుంటారా?" మళ్ళీ అడిగింది.

"నీ యిల్లెక్కడ?" ఆప్రశ్నకు సమాధానం అందులోనే వుంది.

"రండి అంటూ ఆమె ముందుకు దారి తీసింది. నేనూ అనుసరించాను. నెమ్మదిగా నడుచుకుంటూ ఓ పెంకుటింటి చిన్నగది లోనికి ప్రవేశించేం.

లైటు వెలిగించి రంగేళి కూర్చోమని ఆహ్వానించింది. కుర్చీలో కూలబడ్డాను. అభిసారిక తదేకదృష్టితో తిలకిస్తోంది నన్ను.

"ఏమిటలా దీక్షగా పరిశీలిస్తున్నావ్?" అని అడిగేను.

"మీ వయస్సెంత?"

"ఇరవై యైదు"

"నా వయస్సెంతో తెలుసా?"

"తెలుసు"

"తెలిసే వచ్చారా?"

"నీ అందాన్నిచూసి ముగ్ధుణ్ణయాను"

"కాముక వ్యాపారంలో కాకలుతీరిన అందం. ఈ అందాన్నే మీరు అపేక్షించారా?"

"ఏమిటీ వాగుడు? నేను రావడం నీకిష్టం లేదా?"

"యిష్టంలేదని కాదు. ఎవరైతేనేం నాకు కావలసింది డబ్బు. నాకు కావలసింది వ్యాపారము. కానీ నిన్నుచూస్తే జాలిగా వుంది."

"ఎందుకని?"

"నీకు అన్యాయం జరుగుతున్నందుకు. వయస్సులో నీకంటే పెద్దదాన్ని. అది అలా ఉంచు. నీకంటే చిన్నవాళ్లుకూడా నన్ను అనుభవించి వెళ్లేరు. కాని నువ్వు చదువూ, సంస్కారం కలవాడివిలా కనబడుతున్నావు. ఇంత నీచపుపనికి ఎందుకు పూనుకుంటున్నావని ?"

"నీతులు నేర్పుతున్నావానాకు?"

"నీకంటె పెద్దదాన్ని నీతులునేర్పినా తప్పు లేదు. కావలసిందే తడవుగా డబ్బుతో నా అందాన్ని వందలకొద్దీ కొనుక్కొని తమ కామతృష్ణను తీర్చుకున్నారు. నా క్రీగంటి చూపుల్ని చూసి పిచ్చెత్తిపోయారు. నా ముసి ముసి నవ్వుల్నిచూసి మురిసిపోయారు. ఆ నవ్వు విషపు నవ్వయినా వారికి ఎంతో ఆనందాన్నిచ్చేది. నిండువయసులో పొడుచు కొస్తున్న నాయవ్వనాన్ని జట్కావాలానుంచి జరీపంచె కట్టుకున్నవాడివరకూ అనుభవించేరు. ఎంతోమంది యువకులు నాకోసం క్యూ సిస్టంలో వేచివున్న రోజులున్నాయి. ఒక్క రాత్రిలో నన్ను వాంఛించిన వ్యక్తుల్ని నేను వేళ్ళతో లెక్కపెట్టలేను. వారిలో నీవొక డివి. అంతమంది వాంఛల్ని తీర్చినదాన్ని నీకు తీర్చకపోను. కాని నీ లేత హృదయాన్ని చూస్తే నాకు ఆదోలా అనిపించింది. నీవీ నరక కూపంలో పడ్డం నాకు యిష్టంలేదు."

"సరసానికివస్తేసూక్తులునేర్పుతున్నావా?"

"సద్భావంతో చెపుతున్నావిను. నువ్వూహించిన అందం, తళతళమని మెరిసే ఈ తెల్ల చీర అడుగున ఈ మచ్చల్నిచూడు. అన్ని రోగాలు మిళితమై ఈ వికృతరూపం దాల్చేయి. గొప్పగొప్ప మహానుభావులు ముసుగుల్లోవచ్చి వీటిని నాకు ప్రసాదించేరు. నేను నీలాంటి అమాయక యువకులకు ఎంతోమందికి అందిచ్చేను. వారు వారి భార్యలకు అంటగట్టారు. ఈ మచ్చలకు ఈ పుళ్లకు యిప్పటివరకూ మందులు కనిపెట్టలేదు.

"అయితే యిక్కడకు నన్నెందుకు రమ్మన్నావ్?"

"వీధిలో నిన్ను సరిగా చూడలేదు. ఆ కాముకచేష్టలతో నిన్ను ఆకర్షించి ఆహ్వానించేను. ఇప్పుడు నిన్ను సరిగా అర్థంచేసుకున్నాను."

"ఇన్నినీతులు చెప్పేదానివి నువ్వెందుకు ఈ చీకటి వ్యాపారంలోకి దిగేవ్?"

"ఆ సంగతి అడుగుతావని నాకు తెలుసు. నేను స్త్రీని. స్త్రీ అంటే మగవాడు తక్కువ భావంతో చూస్తాడు. సంఘమూ సాంఘికఆచారాలూ పురుషులకే పాదాక్రాంతమయ్యేయి. నా భర్త నన్ను...."

"నీకు పెళ్లయిందా?"

"చెప్తావిను. నాకు పెళ్లయింది. నా భర్త నన్ను సరిగా చూడకుండా అల్లరచిల్లరగా తిరిగేవాడు. వద్దని ఎంతగానో బ్రతిమాలేదాన్ని. తప్పత్రాగి నన్ను గొడ్డును బాదినట్టు బాదేవాడు. అప్పటికీ సహించేను. రోజులు, వారాలు కూడా గడిచేయి. ఒక్కొక్కప్పుడు ఇంటికే వస్తుండేవాడు. మరి యింట్లో గడిచేది యెట్లా? కొన్నిరోజులు పస్తుండి కాలక్షేపంచేశాను. ఒకరోజున యింటికివచ్చి యింట్లో ఏమీ లేదని బయటకు పొమ్మన్నాడు. వ్యభిచారం, త్రాగుడు అతన్ని పీల్చిపిప్పి చేశాయి. మంచంపట్టాడు. ఒకరోజున హఠాత్తుగా కన్నుమూశాడు. దిక్కులేనిదాననయ్యాను. రోజులు గడవక అక్కడక్కడ పనులుచేసుకు బ్రతికేదాన్ని, అదీ కష్టమైంది. ఎక్కడా పని దొరకలేదు. తొలిసారిగా నాకు ఒకతను పది రూపాయలనోటు చేతికిచ్చి కాముకకేళికి నన్ను ఆహ్వానించేడు. మొదట్లో నేను భయపడ్డాను. ఆ వ్యక్తిని సంతృప్తిపరచాను. తరవాత ఈ వ్యాపారానికే అలవాటు పడిపోయాను. పిమ్మట జట్కావాళ్ళు, సైకిల్ షాపువాళ్లు నన్ను వాడుకున్నారు. అప్పుడప్పుడు పెద్దపెద్ద చేతులుకూడా నా వెచ్చని కౌగిల్లో యిమిడిన రోజులున్నాయి. ఎంతోమంది యిష్టంవచ్చినచోటికి నన్ను తీసుకుపోయారు. నాకు కావలసింది డబ్బు. ఆడబ్బు యిప్పుడు కుప్పలు కుప్పలుగా సంపాదించాను. పూర్తిగా చెడినదాన్ని, కాముకక్రీడల్లో ఆరితేరినదిట్టను. ఇదివరకు ఎంతోమంది చెడిపోతున్నా చూసి ఆనందించేదాన్ని. నా అనుభవాలన్నీ ఒక సారి నెమరువేసుకున్నాను. ఇప్పుడు నీలాంటి ఓ అమాయకుణ్ణి సర్వనాశనం చెయ్యడం నాకు యిష్టంలేదు."

కాముకి తన చరిత్రను ముగించి అతని వైపు తిరిగిచూసింది. కానీ ఆ యువకుడు అక్కడ లేకపోవడం చూచి ఆ పడతి ఎంతో ఆనందించింది. ★